క్లుప్తంగా

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్



పూజల్లో పాల్గొన్న ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, భక్తులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. సంకష్ట హర చతుర్థిని పురస్కరించుకొని పట్టణంలోని గంజ్ ఆవరణలోని వినాయక దేవాలయంలో శనివారం బీఆర్‌ఎస్ నేత మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కల్గి ఉండాలన్నారు. భక్తిభావంతో ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. అందరు సన్మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, అభిలాష్, శేఖరప్ప, గోపాల్, ప్రకాశ్, నర్సింలు, శ్రీనివాస్, శ్రీకాంత్, శంకర్‌లాల్ లాహోటీ, గజానంద్, ఓం ప్రకాష్, భరత్, శ్యాం, ప్రకాశ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

ఎంపీడీఓ సంధ్య



వననర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్: పంచాయతీల పరిధిలోని వన నర్సరీల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని.. వర్షాకాలం మొదలయ్యే వరకు నాటేందుకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ సంధ్య సూచించారు. మండలంలోని చిలుకూరు, అప్పోజీగూడ, పెద్దమంగళారం గ్రామ పంచాయతీల్లోని వననర్సరీలను శనివారం ఆమె సందర్శించారు. మొక్కలను ఎలా పెంచుతున్నారు, ఎన్ని మొక్కలు పెంచుతున్నారనే విషయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నర్సరీల్లో మొక్కలు పెంచడంపై పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దన్నారు. మొక్కలకు అవసరమైన నీరు అందించి బాగా పెంచాలని సూచించారు. మొక్కలు పెంచడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, కారోబార్ రాజేష్ తదితరులు ఉన్నారు.


పశువులకు మేతగా వరిపైరు



వరి చేనులో పశువులను మేపుతున్న రైతు

కేశంపేట: వరిపైరు చేతికొచ్చే దశలో నీరు లేకపోవడంతో పంట ఎండిపోయింది. దీంతో ఓ రైతు పశువులను మేపుతున్నాడు. ఈ దృశ్యం శనివారం కేశంపేట మండలం వేముల నర్వ గ్రామ శివారులో కనిపించింది. వివరాలు ఇలా ఉన్నాయి. కేశంపేట మండలం దత్తాయపల్లి గ్రామానికి చెందిన గంగిడి శేఖర్‌రెడ్డి అనే రైతు గ్రామ శివారులో గండ్ల జగదీశ్‌కు చెందిన నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అయితే, గత కొన్ని రోజులుగా ఎండలు ఎక్కువ కావడంతో బోర్లలో నీరు అడుగంటింది. లోవోల్టేజీ కారణంగా బోరు మోటారు కాలిపోవడంతో చేతికొచ్చే సమయంలో వరి పంటకు నీరు అందకపోవడంతో పంట ఎండిపోయిందని వాపోయాడు. దీంతో ఎండిపోయిన పైరులో పశువులను మేపుతున్నట్లు బాధిత రైతు తెలిపారు.

ఘనంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

మొయినాబాద్: భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం మొయినాబాద్ మండల కేంద్రంలో గులాబీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్లు రఫూఫ్, రాజు, మాజీ డైరెక్టర్లు రవీందర్, మహేశ్‌యాదవ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు జయవంత్, నాయకులు నర్సింహ్మగౌడ్, సంజీవరావు, పరమేష్ చెన్నయ్య పాల్గొన్నారు.

మళ్లీ మోదీనే కావాలని ఆకాంక్ష

బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: దేశంలో నరేంద్రమోదీ పాలనే కొనసాగాలని దేశంలోని ప్రజలు, యువకులు కోరుకుంటున్నారని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సింగాపురం గ్రామానికి చెందిన యువకులు పెద్ద సంఖ్యలో విశ్వేశ్వర్‌రెడ్డి బీజేపీలో సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి ప్రతి ఒక్కరిని ఆకర్షిస్తుందని అన్నారు. కేంద్రం పదేళ్లుగా రాష్ట్రానికి అందిస్తున్నా పథకాలను బీఆర్‌ఎస్ మావే అంటూ ప్రచారం చేసుకుంటుందని చెప్పారు. మరోసారి మోదీనే ప్రధాని కావాలని యువత కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్‌యాదవ్, బీజేపీ మండల నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు మోసపూరిత పార్టీలు

మొయినాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను గుప్పించి ప్రజలను మోసం చేసేందుకు చూస్తున్నారని చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని అమ్డాపూర్ గ్రామాన్ని సందర్శించి రక్తమైసమ్మ దేవాలయంలో విశ్వేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలను ఆహ్వానించారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



చేవెళ్ల: కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాము, సీనియర్ నాయకులు క్యామ నారాయణ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ అభ్యర్థి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను తరిమి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లుగా పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్కీంల కంటే స్కాంలు ఎక్కువగా చేసిందన్నారు.

బీజేపీలో చేరిన యువకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీకే అరుణ

నందిగామ: మండల పరిధిలోని నర్సప్పగూడకు చెందిన పలు పార్టీల యువకులు శనివారం మహబూబ్‌నగర్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈమేరకు పార్టీలో చేరిన వారికి డీకే అరుణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్, టీడీపీ పార్టీలకు చెందిన సుమారు 20 మంది చేరారు. చేరిన వారిలో ఎం కిర్యాల నర్సింహా, కాట్న సురేందర్, బంటారం విజయ్,నర్సింహా, సురేందర్, అకాశ్ ఉన్నారు.

చిన్నారులను ప్రోత్సహించాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి

కొత్తూరు: పిన్న వయస్సు నుంచే చిన్నారులను వారి తల్లిదండ్రులు చదువుల్లో ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు పైబడిన చిన్నారులకు శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్‌డేలో ఆమె పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువు పూర్తి చేసుకుని 1వ తరగతిలో చేరనున్న చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీలో మూడేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆట, పాటలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు వివరించారు. కేంద్రాల్లో చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్యం, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వారిని అన్ని విధాలుగా మార్చుతారని తెలిపారు. చిన్నారులు ఆటలు ఆడడం.. తమకు ఇష్టమైన పనులు చేస్తుంటే తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలే తప్ప కోపగించుకోవద్దన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు రత్నమ్మ, యాదమ్మ, ఇందిరమ్మ, పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతో ప్రయోజనం



గ్రాడ్యుయేషన్‌డేలో చిన్నారులు

నందిగామ: చిన్నారుల తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ నాగమణి సూచించారు. నందిగామలో శనివారం అంగన్‌వాడీ కేంద్రాల వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ నాగమణి ముఖ్యఅతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ.. చిన్నారులు విద్యను అభ్యసించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు తొలిమెట్టులాంటివని అన్నారు. ప్రతి ఒక్కరు చిన్నారులను తప్పకుండా అంగన్ వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. 6 ఏళ్లు పూర్తి చేసుకున్న పిల్లలను ప్రాథమిక పాఠశాలకు పంపాలని సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు కోరారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు పోషక ఆహారం విధిగా అందించాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మీబాయి, విజయ, పద్మ, జ్యోతి, సంధ్య, వెంకటమ్మ, దివ్య, అండాలు, జయలక్ష్మి, రేవతి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగం బాధ్యత

మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుష్పలత



అవగాహన సమావేశంలో సభ్యులు

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుష్పలత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో శనివారం ఓటుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మహిళా సంఘాల్లోని సభ్యులంతా తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మహిళలు అన్నింట్లో ముందు ఉండాలని చెప్పారు. అందుకే ఓటుహక్కు అనేది మన బాధ్యతగా భావించాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును వేయాలన్నారు. ఓటు వేయాల్సిన విధానంపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ సంధ్య, ఏపీఎం, సీసీలు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా సుధాకర్‌రావు



కొందుర్గు: భారతీయ జనతా పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా మచ్చా సుధాకర్ రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, సుధాకర్‌రావుకు నియామక పత్రాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతోఅప్పగించిన బాధ్యతలను పార్టీ అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్యలు రానివ్వొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి

జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి

షాద్‌నగర్: మండుతున్న ఎండల దృష్ట్యా గ్రామాల్లో మంచి నీటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీ సమస్యలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. నీటి సమస్య తీవ్రమయితే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలన్నారు. ఎంపీపీ ఖాజా ఇద్రీస్ మాట్లాడుతూ... గ్రామాలను పరిశ్రభంగా ఉంచాలని చెప్పారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనపై పంచాయతీ ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ బన్సీలాల్, సీడీపీఓ నాగమణి, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ విజయ, మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ రవీంద్రకుమార్, ఎంపీటీసీలు, పంచాయతీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

పేలుడు సామగ్రి సీజ్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి శివారులో పేలుడు పదార్థాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సక్రమ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంపల్లి శివారులో అక్రమంగా రాతిబండలకు పగులగొడుతున్నట్లు సమాచారం తెలియడంతో శనివారం పోలీసులు అక్కడికి చేరుకొని అక్కడ ఉన్న ఏపీ 15 ఎఎక్స్ 3855 నంబర్ గల కంప్రేషర్ ట్రాక్టర్, 56 డెటోనేటర్స్, 52 జిలెటిన్ స్టిక్స్, ఒక బ్యాటరీ, 10 మీటర్ల బైండిగ్ వైర్, మూడు ఐరన్ డ్రిల్లింగ్ రాడ్‌లు, కంప్రేషర్ జాకీ సీజ్ చేసినట్లు ఎస్సై సక్రమ్ చెప్పారు. అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న వడ్డె నరేష్, వడ్డె శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదు

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

మొయినాబాద్ రూరల్: తెలంగాణలో బీజేపీకి ఓటు అడిగే నైతిక హక్కు లేదని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, టీపీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్‌లు అన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బూత్ లెవల్ సభ్యులతో సమావేశం సదస్సును నిర్వహించారు. ఈ సదస్సు మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిధులుగా గౌరీసతీశ్, దర్శన్‌లు పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును పార్లమెంట్ సాక్షిగా నరేంద్రమోడీ హేళన చేశారని దుయ్యబట్టారు. అలాగే, విభజన హామీలను అమలు చేయని ఎన్‌డీఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేటాయించకుండా, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీని నిర్మాణం, ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను 211 గ్రామాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కలిపిన కేంద్ర ప్రభుత్వానికి కర్రకాల్చి వాతపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. 2020 సంవత్సరంలో హైదరాబాద్‌లో వరదలు వచ్చినప్పుడు విపరీతమైన నష్టం జరిగితే కనీసం ఒక రూపాయి కూడా సహాయం అందించని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ముఖం పెట్టుకోని కేంద్ర మంత్రులు, నాయకులు ఓట్లు అడుగుతున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన తల్లి సోనియమ్మకు చేవెళ్ల నియోజకవర్గాన్ని బహుమతిగా ఇద్దామని, 23 బూత్‌ల కాంగ్రెస్ వాదులు సైనికులుగా పని చేసి చేవెళ్ల నియోజకవర్గాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న గౌరీ సతీష్

మహిళా కండక్టర్‌పై దాడి

కేశంపేట: టికెట్ తీసుకోవాలని అడిగిన కండక్టర్‌ను కొందరు మహిళలు చితబాదారు. మహిళా కండక్టర్ శాంతమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు నుంచి షాద్‌నగర్ బయలుదేరిన బస్సులో కేశంపేట వద్ద ఏడుగురు మహిళలు ఎక్కారు. వేడులనర్వ గ్రామంలో దిగేందుకు బస్సును ఎక్కారు. వీరిలో నాలుగురి వద్ద ఉచిత ప్రయాణానికి కావాల్సిన ఆధార్‌కార్డులు ఉన్నాయి. మిగతా ముగ్గురు టికెట్ తీసుకోవాలని కండక్టర్ వారిని కోరింది. మేము టికెట్ తీసుకోమంటూ అసభ్య పదజాలంతో కండక్టర్‌ను దూషించారు. అయినా టికెట్లు తీసుకోవాలని కండక్టర్ వారిని కోరింది.. దీంతో మరింత ఆవేశానికి లోనైనా వారు ఆమె చితకబాదారు. దీంతో తీవ్రంగా గాయపడిన మహిళా కండక్టర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఎడుగురు మహిళలు కూలీ పనులకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో మద్యం సేవించి ఉన్నట్లు కండక్టర్, తోటి ప్రయాణికులు తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

నందిగామ: చెరువులో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన నందిగామలోని అంబపురం చెరువులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం వివరాలు.. గ్రామానికి చెందిన అగ్గి సుధాకర్(69) శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మల విసర్జన కోసం గ్రామ సమీపంలోని అంబపురం చెరువు సమీపంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఉదయం స్థానికులు సమాచారం మేరకు కుటుంబ సభ్యులు చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని పరిశీలించగా సుధాకర్‌గా గుర్తించారు.



సుధాకర్ (ఫైల్)

గెలుపే లక్ష్యంగా ముందుకు..

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు గ్రామగ్రామానా తిరిగి వివరించాలన్నారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త శ్రమించి పని చేయాలని సూచించారు. పార్టీలో నేతలు వ్యక్తిగత విభేదాలను పక్క పెట్టి కలిసికట్టుగా పని చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం శ్రమించే నాయకులు, కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యకర్తలను తాము కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో వంశీచంద్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, కొంకళ్ల చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, విశాల, వెంకట్ రాంరెడ్డి, దామోదర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఇబ్రహీం, అందెమోహన్, యాదయ్యయాదవ్, రవికుమార్‌గుప్తా, ఖదీర్ బుజ్జి బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

కొందుర్గు: కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహరెడ్డి అన్నారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో మేడే జయప్రదం చేయాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 75 సంవత్సరాల స్వాతంత్ర కాలంలో ఎన్నడూ లేని విధంగా 44 కార్మిక చట్టాల్లో 29 కార్మిక చట్టాలను సమూలంగా రద్దు చేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చరని విమర్శించారు. అలాగే, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతులను నట్టేట ముంచిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అందరూ సిద్ధంగా కావాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య, ఏఐటీయూసీ మండల కమిటీ అధ్యక్షుడు బాల్‌రాజ్, నాయకులు వీరేశం, రమేశ్, శబ్బీర్, పాపయ్య, జంగమ్మ, చంద్రమ్మ పాల్గొన్నరు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

షాబాద్: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని నాగర్‌గూడ పీఎస్‌ఆర్ గార్డెన్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డికి మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరోసారి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అత్యధికంగా పార్లమెంట్ స్థానాలను గెలుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్‌తోనే దేశ భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. కార్యక్రమలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్, మాజీ సర్పంచ్‌లు ఖాజామీయా పటేల్, రవీందర్‌నాయక్, చేవెళ్ల స్వామి, ఆశ్వక్‌అలీ, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కుమ్మరి వేణు, కృష్ణ, తదితరులున్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం

చేవెళ్ల: చేవెళ్ల గడ్డపై రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయమని కాంగ్రెస్‌పార్టీ నాయకులు అన్నారు. చేవెళ్ల మండలంలోని చనువెల్లి, ఇక్కారెడ్డిగూడ గ్రామాల్లో శనివారం ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలను కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్‌పార్టీ అంటేనే చేవెళ్ల అన్నట్లుగా చేవెళ్ల ప్రాంతం కాంగ్రెస్ అభిమానులు ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటేనే మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పెంటయ్యగౌడ్, వీరేందర్‌రెడ్డి, డి. గోపాల్‌రెడ్డి, గోపాల్, ప్రభాకర్, బీమయ్య, జంగారెడ్డి, క్రిష్టారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, సుశాంత్, రాజు, జనార్దన్ తదితరులు ఉన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విద్యుదాఘాతంతో రైతు మృతి

షాద్‌నగర్‌రూరల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ శరత్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మధురాపూర్ గ్రామానికి చెందిన నంద్యాల జంగారెడ్డి(57) వ్యవసాయంచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జంగారెడ్డి పొలానికి వెళ్లే దారిలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఇది గమనించని ఆయన విద్యుత్ వైర్లు తగలాయి. విద్యుదాఘాతానికి గురైన ఆయన అక్కకడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శరత్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అరుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శరత్‌కమార్ తెలిపారు.



జంగారెడ్డి(ఫైల్)

బీజేవైఎం స్టేట్ ఆఫీస్ కోఆర్డినేటర్‌గా శివానంద్

నందిగామ: బీజేవైఎం స్టేట్ ఆఫీస్ కో ఆర్డినేటర్‌గా నర్సప్పగూడ గ్రామానికి చెందిన జెల్ల శివానంద్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివానంద్ మాట్లాడుతూ.. పార్టీ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను నెరవేర్చేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తానని చెప్పారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్ రెడ్డి, నాయకులు అందె బాబయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



నియామకపత్రం అందుకుంటున్న శివానంద్

అప్పుల బాధతో ఫాంహౌస్ ఓనర్ ఆత్మహత్య

మొయినాబాద్: అప్పుల బాధతో ఓ ఫాంహౌస్ ఓనర్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌లోని ఉప్పర్‌పల్లి పీఎంటీ రెసిడెన్సీకి చెందిన చెందిన మలిగిరెడ్డి వెంకట్‌రెడ్డి(48)కి మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి రెవెన్యూలో ఫాంహౌస్ ఉంది. అతను వ్యాపారం కోసం కొన్ని అప్పులు చేశాడు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిన వెంకట్‌రెడ్డి రాత్రయినా రాకపోవడంతో భార్య సరిత విషయాన్ని వెంకట్‌రెడ్డి స్నేహితులకు చెప్పింది. వారు శనివారం తెల్లవారు జామున ఫాంహౌస్‌కు వెళ్లి చూడగా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



వెంకట్‌రెడ్డి(ఫైల్)